www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

సోమవారం, 27.05.2024, హైదరాబాద్ | తెలుగు దిన పత్రిక | సంపుటి: 2, సంచిక: 226




## నిమ్స్ వైద్యులూ హాట్సాఫ్

- ఆదివాసీకి కాపాడటం అభినందనీయం
- డాక్టర్లను పొగిడిన సీఎం రేవంత్ రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఛాతీలో బాణం దిగిన ఆదివాసీ యువకుడిని కాపాడిన నిమ్స్ వైద్యులను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ప్రాణాపాయం లేకుండా చాకచక్యంగా బాణాన్ని తొలగించారని 'ఎక్స్' వేదికగా కితాబిచ్చారు. ప్రజల్లో నిమ్స్‌పై ఉన్న నమ్మకాన్ని మరోసారి రుజువు చేశారన్నారు. భవిష్యత్‌లో నిమ్స్ మరింత విస్తృతంగా వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. మిగతా 2లో

## నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- మొత్తం 4 లక్షల 63 వేల 839 మంది ఓటర్లు
- 605 పోలింగ్ కేంద్రాలు
- 55 మంది అభ్యర్థులు పోటీలో
- అధికంగా ఖమ్మం జిల్లాలో 118, అతి తక్కువగా సిద్ధిపేటలో 5 పోలింగ్ కేంద్రాలు




**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

వరంగల్‌నల్గొండఖమ్మం శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగనుంది. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక మిగతా 2లో

# గాలివాన బీభత్సం

- నాగర్ కర్నూల్ జిల్లాలో విషాదం
- ఏడుగురు దుర్మరణం
- కోళ్ల ఫారం ప్రహరీ గోడ కూలి
- నలుగురు దుర్మరణం
- తెలకపల్లిలో పిడుగుపాటుకు ఒకరి మృతి
- మేడ్చల్ జిల్లాలో ఒకరు దుర్మరణం




**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఇంద్రకల్‌లో ఆదివారం గోడ కూలి నలుగురు కార్మికులు మృతి చెందారు. మరో ఇద్దరు కార్మికులకు గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. భారీ వర్షం, ఈదురుగాలులకు కోళ్ల ఫారం ప్రహరీ గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. మృతుల్లో ఇద్దరు కూలీలు, యజమాని మల్లేష్, ఓ చిన్నారి ఉన్నట్లు తెలుస్తోంది. అటు, ఇదే జిల్లాలోని తెలకపల్లి మండల కేంద్రంలో పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడు.

### భారీ వృక్షం విరిగి..

అటు, మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సమీపంలో ఈదురుగాలులకు ఓ భారీ వృక్షం విరిగి బైకర్‌పై పడింది. ఈ ప్రమాదంలో నాగిరెడ్డి అనే వ్యక్తి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### హైదరాబాద్‌లో భారీ వర్షం

మరోవైపు, హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో వాన పడుతోంది. అంబర్ పేట, కాచిగూడ, నల్లకుంట, ఉప్పల్, మన్సూరాబాద్, మల్కాజిగిరి, తుర్కయాంజల్ ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అటు, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వనస్థలిపురంలో గాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. అలాగే, ఘట్కేసర్ మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలి బీభత్సానికి ఈసీఐఎల్ వెళ్లే దారిలో చెట్లు విరిగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### సంగారెడ్డి జిల్లాలో..

అటు, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి ఓ మేస్త్రీ ప్రాణాలు కోల్పోయాడు. భవనానికి ప్లాస్టరింగ్ చేస్తుండగా ఏడో అంతస్తు నుంచి జారిపడి బెంగాల్‌కు చెందిన మజ్ముల్ షేక్ (33) అనే మేస్త్రీ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

- పిల్లల దవాఖానలో విషాదం
- ఏడుగురు నవజాత శిశువుల దుర్మరణం

వివరాలు 2లో

## 30 కోట్లు పంచేందుకు బీఆర్ఎస్ రెడీ

- వాళ్ల అకౌంట్లు సీజ్ చేయండి
- 34 మంది ఎన్నికల ఇన్ చార్జ్ లకు పైసలు
- బీజేపీ నేత రఘునందన్ రావు
- వాళ్ల అకౌంట్ల వివరాలు ఈసీకి అందజేత

వివరాలు 2లో



# రాష్ట్రంలో భారీ స్కామ్

- 35 లక్షల టన్నుల ధన్యాం సేకరణ మొదటి కుంభకోణం
- మధ్యాహ్న భోజన పథకం కోసం 2 లక్షల మెట్రిక్ టన్నుల పేరిట మరో స్కామ్
- మొత్తం 1,100కోట్లు గోల్ మాల్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్.. భారీ కుంభకోణానికి శ్రీకారం చుట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. పౌరసరఫరాల శాఖలో 35 లక్షల టన్నుల ధాన్యం సేకరణ కోసం పిలిచిన గ్లోబల్ టెండర్లు మొదటి కుంభకోణమని ఆరోపించారు. మధ్యాహ్న భోజన పథకం కోసం 2 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం కొనుగోళ్లు పేరిట మరో కుంభకోణం జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. ఈ రెండు కలిపితే రూ. 11,00 కోట్ల కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 50 రోజులు కాకముందే ఈ దోపిడికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వంతో ఏ పని కాదంటూ తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు కేటీఆర్. మహిళలకు రూ. 2500 ఇవ్వడానికి ఈ ప్రభుత్వానికి సమయం లేదని మండిపడ్డారు. ఆసరా పెన్షన్లు కనిపించట్లేదన్నారు.. రూ. 2 లక్షల రుణమాఫీ చేసే తెలివి లేదంటూ విమర్శలు గుప్పించారు. సంక్షేమపథకాల విషయంలో ఇంత నిర్లక్ష్యంగా ఉన్న ప్రభుత్వం.. గ్లోబల్ టెండర్ల కోసం మాత్రం జనవరి 25 రోజునే కమిటీ వేసి.. అదే రోజు గైడ్ లైన్స్ ఇవ్వడం, ఆ రోజే టెండర్లను పిలవడం కూడా జరిగిపోయిదని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో ఉండే రైస్ మిల్లర్లు 2,100 ధాన్యం కోనుగోళ్లు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వానికి తెలిపారని కేటీఆర్ తెలిపారు. రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి ఆఫర్ ఇస్తే దాన్ని రిజెక్ట్ చేసి.. వారి మాట వినకుండా గ్లోబల్ టెండర్ల పేరిట కొన్ని నిబంధనలు పెట్టి మిల్లర్లను పక్కన పెట్టారన్నారు. గతంలో కేంద్రియ బండార్ అనే సంస్థను బ్లాక్ లిస్ట్ చేశామని తెలిపారు. ఈ ప్రభుత్వం బ్లాక్ లిస్ట్‌లో ఉన్న సంస్థను రూల్స్ బ్రేక్ చేసి తొలగించి నాలుగు కంపెనీలతో కుమ్మకు అయ్యారని వెల్లడించారు. ఈ నాలుగు సంస్థలు మనిలాండరింగ్‌కు పాల్పడుతూ 4 వేల మంది మిల్లర్లను బెదిరిస్తున్నారని ఆరోపించారు

## చట్టబద్ధంగా రైతులకు కనీస మద్దతు ధర అందిస్తాం

- ఇండియా కూటమితో అన్నదాతల కష్టానికి తగిన ఫలితం
- నిరుద్యోగులకు ఏడాదికి లక్ష రూపాయలు
- పంజాబ్ ఫరీద్ కోట్‌లో భట్టి ప్రచారం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

ఇండియా కూటమి అధికారంలోకి రాగానే చట్టబద్ధంగా రైతులకు కనీస మద్దతు ధరను అందిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అన్నదాతల కష్టానికి తగిన మిగతా 2లో

## డబ్బులు మోయడం బీజేపీ కల్చర్

- పౌర సరఫరాలశాఖలో అవినీతి అవాస్తవం
- మహేశ్వర్ రెడ్డిది డబుల్ గేమ్
- బయటేమో.. ధాన్యం కోనుగోళ్లు.. లోపల ల్యాండ్ సెటిల్మెంట్లు
- ఇది మహేశ్వర్ రెడ్డి కల్చర్
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్, బీజేపీ కలిసి ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నాయని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మిగతా 2లో

## ఓటమి భయంతో ఈసిపై ఇండియా కూటమి ఆరోపణలు

- బీజేపీ 400 సీట్లును దాటుతుంది
- ముస్లింల రిజర్వేషన్‌లో కాంగ్రెస్ ప్రజలను తప్పదోవ పట్టిస్తోంది
- జమ్ముకశ్మీర్‌లో ప్రశాంతంగా పోలింగ్ మోది విజయం
- రెండు మూడేళ్లలో దేశంలో నక్సల్స్ ఖతం
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

ఈ లోక్ సభ ఎన్నికల్లో విపక్ష పాలిత రాష్ట్రాల్లో కూడా బీజేపీ భారీ విజయం సాధిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ భారీ మెజారిటీతో గెలుస్తుందని తెలిసి విపక్షాలు ఓటమికి సాకులు వెతుక్కుంటూ ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ మతం ఆధారంగా ప్రచారం చేయలేదని, ముస్లింల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రచారం చేసిందని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు గురించి ఓటర్లకు చెప్పి, యూసీసీ అమలుపై మాట్లాడడం మత ఆధారిత ప్రచారమైతే బీజేపీ అదే చేసిందని అన్నారు. పోలింగ్ ప్రక్రియపై కాంగ్రెస్ ప్రశ్నలు, రాహుల్ గాంధీ వైఫల్యాన్ని మిగతా 2లో

## రాష్ట్ర ప్రయోజనాలకు అడ్డొస్తే ఎవరినీ సహించం

- ప్రతిపక్షాలు ప్రభుత్వానికి సహకరించాలి
- ప్రభుత్వం ఏర్పడిన 40 రోజుల్లోనే హామీలు అమలు చేశాం
- పరిశ్రమలు ఎక్కడికి పోవడం లేదు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు




**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కాకుండానే ఎన్నికల కోడ్ వచ్చిందని, ప్రభుత్వానికి సహకరించాలని ప్రతిపక్షాలను కోరామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పరిపాలనలో కొన్ని తప్పులు జరుగుతూ ఉంటాయని ఇవి సహజమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 40 రోజుల్లోనే హామీలు అమలు చేశామని గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మిగతా 2లో

### పరిశ్రమలు ఎక్కడికి పోవడం లేదు

తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, ఉత్తమ్ కుమార్‌కు మంచి పేరు వస్తుందనే తప్పడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. పరిశ్రమలకు సంబంధించి కట్టుబడి ఉన్నామని, గత ప్రభుత్వంలో మంచి ఉంటే దాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమలు ఎక్కడికో పోతున్నాయని కేటీఆర్ అంటున్నారు, కానీ అవి ఎక్కడికి పోవట్లేదు కొత్తవి వస్తున్నాయని తెలిపారు. తమ పని తీరే తమ మాటలు అని అన్నారు. తమ ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే అనేక పరిశ్రమలు ఎంవోయూలు చేసుకున్నాయన్నారు. కేయిన్స్ పరిశ్రమ ఎక్కడికీ పోలేదని, కేంద్రం ఇచ్చే రాయితీల కోసం ఎదురు చూస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు వివరణ ఇచ్చారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
2
సోమవారం, 27.05.2024
హైదరాబాద్

# నిమ్స్ వైద్యులూ హాట్సాఫ్

మొదటిపేజీ తరువాయి

ప్రమాదవశాత్తు ఛాతీలో దిగిన బాణంతో దాదాపు 24 గంటలు విలవిల్లాడుతూ నరకయాతన అనుభవించిన సోది నంద (17) అనే గిరిజన గిరిజన యువకుడికి నిమ్స్ వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన సంగతి తెలిసిందే. ఛత్తీస్‌గఢ్‌కి చెందిన సోదినందకు వారం రోజుల క్రితం ప్రమాదవశాత్తూ బాణం గుచ్చుకుంది. సరిగ్గా గుండె, ఊపిరితిత్తుల మధ్యలో దిగటంతో బాధితుడిని కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రికి, ఆ తర్వాత వరంగల్ ఎంజీఎంకి తీసుకువెళ్లారు. అయితే పరిస్థితి విషమించటంతో అక్కడి వైద్యులు హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లాలని సూచించారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డా.అమరేశ్వర్‌రావు బృందం దాదాపు నాలుగు గంటలపాటు శ్రమించి శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం యువకుడు ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు ప్రకటించారు.

# నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక

మొదటిపేజీ తరువాయి

కావడంతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోపాటు లోక్ సభ ఎన్నికల పోలింగ్ జరిగిన కొన్ని రోజులకే ఉప ఎన్నిక జరుగుతుండటంతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రధాన పార్టీలన్నీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఎత్తులుపైఎత్తులు, వ్యూహప్రతివ్యూహాలని ప్రదర్శించాయి. ఈనెల 2న నోటిఫికేషన్ జారీ చేసిన ఎన్నికల కమిషన్, 9 వరకు నామినేషన్లు స్వీకరించింది. కాంగ్రెస్ తరఫున తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డి, బీజేపీ నేత ప్రేమేందర్ సహా 52 మంది పోటీలో ఉన్నారు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 4 లక్షల 63వేల 839 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారిలో 2 లక్షల 88 వేల 189 మంది పురుషులు కాగా లక్షా 75 వేల 645 మంది మహిళలున్నారు. వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, సిద్ధిపేట, ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 605 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు.

అధికంగా ఖమ్మం జిల్లాలో 118, అతి తక్కువగా సిద్ధిపేటలో 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1448 మంది పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులని నియమించారు. సోమవారం మద్యం దుకాణాలు బంద్ సహా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. బ్యాలెట్ పద్ధతిలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఓటర్లు పోలింగ్ కేంద్రంలో అధికారులు ఇచ్చిన వయొలెట్ రంగు పెన్నుతో ప్రాధాన్యతను టిక్ చేయాలి. మైసూరులోని మైసూర్ పెయింట్స్ నుంచి పెన్నులని ఎన్నికల కమిషన్ సమకూర్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నోటా ఉండదు. ప్రజాప్రాతినిధ్యం చట్టంలో ఎమ్మెల్సీ ఎన్నికకు గరిష్ఠ వ్యయ పరిమితి లేకపోవడంతో పలువురు అభ్యర్థులు భారీగా ఖర్చు చేశారు.

ఎండ తీవ్రత ఉంటే షామియానా, కుర్చీలు, మంచినీటి వసతి ఏర్పాటు చేయాలని పోలింగ్ అధికారులను ఈసీ ఆదేశించింది. వర్షం పడితే పోలింగ్‌తోపాటు బ్యాలెట్ పత్రాల రవాణాలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. ఓటు వేసేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ సెలవు ఇవ్వాలని సీఈవో ఆదేశించారు. ప్రైవేట్ కార్యాలయాల సిబ్బంది ఓటు వేసేందుకు యాజమాన్యాలు సహకరించాలని, షిఫ్టుల సర్దుబాటు, ఆలస్యం వచ్చేందుకు లేదా మధ్యలో వెళ్లి ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. లోక్‌సభ ఫలితాలు వెల్లడైన మరుసటిరోజు అంటే జూన్ 5న ఓట్ల లెక్కింపు జరగనుంది

# ఓటమి భయంతో ఈసీపై ఇండియా కూటమి ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

కప్పిపుచ్చుకునేలా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ప్రముఖ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో అమిత్ షా విపక్షాలపై మండిపడ్డారు.

"ప్రతిపక్షాలు ఎన్నికల్లో ఓడిపోయినప్పుడల్లా కొన్ని ప్రశ్నలను లేవనెత్తాయి. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తాయి. ఈవీఎంలు ట్యాంపరింగ్ జరిగే అవకాశమే లేదు. బీజేపీ ఈ లోక్సభ ఎన్నికల్లో తప్పకుండా 400సీట్లు దాటుతుంది. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్లో కూడా ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పాటవుతాయి. పేదల సంక్షేమం, దేశ రక్షణ, ఆర్టికల్ 370 రద్దు, యూసీసీ, మహిళా రిజర్వేషన్, రామ మందిరం వంటి బీజేపీ అజెండాలోని ముఖ్య ఘట్టాలను మోదీ నిజం చేశారు. అందుకే ఆయన పట్ల ప్రజాదరణ పెరిగింది. ముస్లింల రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. పేదింటి మహిళలకు ఏడాదికి రూ.లక్ష ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి రావడానికి ప్రజాకర్షక హామీలు గుప్పించిన చరిత్ర కాంగ్రెస్కు ఉంది. బంగాల్లో బీజేపీ 2430 సీట్లు, ఒడిశాలో 16 17 సీట్లు సాధిస్తుంది. అలాగే ఆంధ్రప్రదేశ్లో ఎన్డీఏ కూటమి 17 స్థానాలను కైవసం చేసుకుంటుంది." అని అమిత్ షా వ్యాఖ్యానించారు.జమ్ముకశ్మీర్లో వేర్పాటువాదులు కూడా అత్యధికంగా ఓటేశారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. జమ్ముకశ్మీర్లో ప్రశాంతంగా పోలింగ్ ముగియడాన్ని మోదీ ప్రభుత్వం సాధించిన విధానపరమైన విజయంగా అభివర్ణించారు. ఈ ఏడాది సెప్టెంబరులో జమ్ము కశ్మీర్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని పునరుద్ఘాటించారు. ఎన్నికలు ముగిసిన తర్వాత జమ్ము కశ్మీర్కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తుందని తెలిపారు.

"మేము జమ్ముకశ్మీర్లో డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేశాం. ఎందుకంటే డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తైన తర్వాతే రిజర్వేషన్లు ఇవ్వొచ్చు. జమ్ముకశ్మీర్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ పూర్తైంది. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువుకంటే ముందే జమ్ముకశ్మీర్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తాం. కశ్మీర్ లోయలో ఓటింగ్ పెరిగింది. అక్కడి ప్రజలకు భారత రాజ్యాంగంపై నమ్మకం లేదని కొందరు చెబుతుండేవారు. వేర్పాటువాదులు, పాక్కు మద్దతుగా మాట్లాడేవారు ఈ సార్వత్రిక ఎన్నికల్లో భారీ సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి దక్కిన విజయం. గత పదేళ్లుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కశ్మీర్ పాలసీకి దక్కిన విజయం. భవిష్యత్లో కశ్మీర్ లోయలో బీజేపీ అభ్యర్థిని పోటీలో నిలుపుతాం. పార్టీని బలోపేతం చేస్తున్నాం. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) భారత్లో భాగమే. పీఓకేను స్వాధీనం చేసుకోవడడమనేది బీజేపీ మ్యానిఫెస్టోలో ఉంది. అంతేకాకుండా పార్లమెంట్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అందుకు కాంగ్రెస్ కూడా మద్దతుగా ఓటేసింది." అని అమిత్ షా వ్యాఖ్యానించారు.

**మరో రెండు మూడేళ్లలో దేశంలో నక్సల్స్ ఖతం**

దేశంలో నక్సల్స్ సమస్య వచ్చే రెండు మూడేళ్లలో తీరిపోతుందని అమిత్ షా తెలిపారు. ఛత్తీస్‌గఢ్లోని చిన్న ప్రాంతంలో తప్ప యావత్ దేశం నక్సల్స్ నుంచి విముక్తి పొందిందని పేర్కొన్నారు. ఛత్తీస్గఢ్లో 5నెలల క్రితం బీజేపీ సర్కార్ అధికారం చేపట్టడం వల్ల నక్సల్స్ చర్యలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు.

# రాష్ట్ర ప్రయోజనాలకు అడ్డొస్తే ఎవరినీ సహించం

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సూర్యాపేట సభలో విద్యుత్ పోతే ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ ఆరోపణలు చేసిందని మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఫీడర్, ట్రాన్స్ ఫార్మర్ సమస్యలు వస్తాయన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ సమస్యలు పరిష్కరించలేదని ధ్వజమెత్తారు. కానీ తమ ప్రభుత్వంలో 30 నిమిషాల్లోనే అధికారులు విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు.

# ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం




విశాలభారతి,నేషనల్ బ్యూరో:

దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. తూర్పు దిల్లీ ప్రాంతం వివేక్ విహార్‌లో ఉన్న శిశు సంరక్షణ ఆసుపత్రిలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఏడుగురు నవజాత శిశువులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురికి చికిత్స అందుతోంది. వీరిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.అగ్నిమాపక సిబ్బంది వివరాల ప్రకారం శనివారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది. సమాచారం అందిన వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపులోకి తెచ్చారు. మంటలు చెలరేగడానికి గల కారణం తెలియాల్సి ఉంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరో ఘటనలో ఢిల్లీలోని షహదారా ప్రాంతంలోనూ శనివారం అర్ధరాత్రి ఓ నివాస భవనంలో మంటలు చెలరేగాయి సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 13 మందిని రక్షించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో గేమింగ్ జోన్‌లో చెలరేగిన మంటల్లో 27 మంది ఆహుతైన విషయం తెలిసిందే. ఈ ఘటన నుంచి తేరుకోకముందే దిల్లీలో నవజాత శిశువుల మరణం ఆందోళనకరం. ''ఢిల్లీలోని ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదం హృదయ విదారకం. ఈ కష్టసమయంలో నా ఆలోచనలన్నీ మృతుల కుటుంబాల గురించే. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను''

# 30 కోట్లు పంచేందుకు బీఆర్ఎస్ రెడీ

విశాలభారతీ,స్టేట్ బ్యూరో:

నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక తుది అంకానికి చేరుకుంది. ప్రచారానికి గడువు ముగియడంతో ఇక అందరి దృష్టి పోలింగ్‌పై పడింది. రేపు ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. పోలింగ్ కోసం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. అదే సమయంలో ప్రలోభాల పర్వానికి తెరలేసినట్లు తెలిసింది. ఈ ఎన్నికను కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా పట్టభద్రుల ఓట్లను కొనుగోలు చేసేందుకు పార్టీలు యత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



తాజాగా.. బీఆర్ఎస్ పార్టీపై బీజేపీ మాజీ ఎమ్మెల్యే మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు సంచలన ఆరోపణ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రూ.30 కోట్లతో ఓట్ల కొనుగోలుకు బీఆర్ఎస్ పార్టీ తెరలేపిందన్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి రఘునందన్ రావు వేర్వేరుగా లేఖలు రాశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కెనరా బ్యాంక్‌లోని బీఆర్ఎస్ అధికారిక అకౌంట్ నుంచి 34 మంది ఎన్నికల ఇన్‌ఛార్జులకు నగదు ట్రాన్స్‌ఫర్ జరిగినట్లు రఘునందన్ ఆరోపించారు.

ఈ మేరకు బ్యాంక్ అకౌంట్ వివరాలను ఎన్నికల సంఘానికి రాసిన లేఖతో జతచేశారు. దీనిపై వెంటనే చర్యలు చేపట్టాలని.. లేకుంటే కోట్లాది రూపాయలను పట్టభద్రుల ఓట్ల కొనుగోలుకు ఉపయోగిస్తారని లేఖలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఖాతాలోని డబ్బును వెంటనే ఫ్రీజ్ చేసి విచారణ జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. కాగా, ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఏనుగు రాకేష్ రెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.

# బీజేపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- ఈసారి బీజేపీకి ఘోర పరాజయం
- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే

విశాలభారతి,నేషనల్ బ్యూరో:


లోక్‌సభ ఎన్నికల్లో తాము విజయం సాధిస్తామని, ఈ విషయంలో కాషాయ పార్టీ కంటే తాము మరింత విశ్వాసంతో ఉన్నామని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పట్నాలో విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఆగ్రహంతో ఈసారి బీజేపీకి ఘోర పరాజయం ఎదురవనుందని అన్నారు.ప్రధాని మోదీ ముజ్రా వ్యాఖ్యలను ఖర్గే తీవ్రంగా ఖండించారు. ప్రధాని వ్యాఖ్యలు బిహార్ ప్రజలను అవమానించడమేనని, ప్రధాని ఇలాంటి భాషను వాడటం సరైంది కాదని, ఇది తప్పిదమని, ఎవరూ ఇలాంటి పదజాలం వాడరాదని ఖర్గే హితవు పలికారు. మరోవైపు చండీఘఢ్‌లో జరిగిన ర్యాలీలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తే 50 శాతం ప్రభుత్వ ఉద్యోగాలు మహిళలకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అంబానీ, అదానీల కోసం ప్రధాని మోదీ ఖాళీగా ఉంచిన 30 లక్షల ఉద్యోగాలను తాము భర్తీ చేస్తామని చెప్పారు. రైతు రుణాలను మాఫీ చేస్తామని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. మీకు ఎలాంటి ప్రభుత్వం కావాలో ఇప్పుడు మీరు నిర్ణయించుకోవాలని ఆమె ప్రజలను కోరారు. నిజాయితీతో కూడిన రాజకీయాలు మనకు అవసరమని చండీఘఢ్ నుంచి దేశమంతటికీ సందేశం పంపాలని ఆమె పిలుపు ఇచ్చారు



# డబ్బులు మోయడం బీజేపీ కల్చర్

మొదటిపేజీ తరువాయి

అన్నారు. అబద్ధాలు, అవాస్తవాలను ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో సివిల్ సప్లయ్ డిపార్ట్మెంట్ 58 వేల కోట్ల రూపాయల అప్పులు చేసిందని అన్నారు. తాము తడిచిన ధాన్యాన్ని ఎమ్మెస్పీ ధరకి కొనాలని విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఎమ్మెస్పీ ధరకు కొన్న ఏకైక ప్రభుత్వం తమదేనని అన్నారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర రెడ్డి ఢిల్లీకి డబ్బులు పంపి ఆ పదవిని కొనుక్కున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. ఢిల్లీకి డబ్బు పంపే సంస్కృతి తమది కాదని తెలిపారు. బయట ధాన్యం గురించి మాట్లాడి, లోపల భూముల విషయం మాట్లాడే సంస్కారం తమది కాదని అన్నారు. కేటీఆర్, మహేశ్వర రెడ్డి తెలిసీ తెలియని విషయాలను మాట్లాడుతున్నారని అన్నారు. అటువంటి బాధ్యతారాహిత్యమైన ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. తనలాంటి నిజాయితీ పరుడిపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సరైంది కాదని చెప్పుకొచ్చారు. టెండర్‌లో ఉన్న కండిషన్స్ కి ఒప్పుకుంటే ఎంత ధాన్యం అమ్మినా ప్రభుత్వం కొంటుందని తెలిపారు. మిల్లర్లపై ఇంత కఠినంగా ఉన్న ప్రభుత్వం తమదేనని అన్నారు. మిల్లర్లలో తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పార్టీలో ఓవర్ స్పీడ్ గా పోవాలని మహేశ్వర రెడ్డి అనుకుంటున్నారని చెప్పారు. కిషన్ రెడ్డిని ఓవర్ టేక్ చేయాలని మహేశ్వర రెడ్డి భావిస్తున్నారని అన్నారు. అవాస్తవాలను ప్రచారం చేస్తూ, అవే నిజమని నమ్మించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, బాధ్యత లేకుండా ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గత ప్రభుత్వంలో పౌరసరఫరాల విభాగం రూ.58 వేల కోట్లు అప్పులు చేసిందని, అందులో రూ.11 వేల కోట్ల మేర నష్టాలేనని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలోనూ గత పాలకులు రూ.20 కోట్ల విలువైన ధాన్యాన్ని రైస్ మిల్లుల వద్దే వదిలేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. తాము ఈసారి ముందుగానే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని, రైతులకు చెల్లింపులు కూడా వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు జరిగింది రూ.200 కోట్లేనని, అలాంటిది రూ.2,000 కోట్ల అవినీతి జరిగిందని ఎలా అంటారని ఉత్తమ్ మండిపడ్డారు. నేను ఉత్తమ్ కుమార్ రెడ్డిని... నాపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు అని ఆగ్రహం వెలిబుచ్చారు. రాష్ట్రంలో తాను యూ ట్యాక్స్ వసూలు చేస్తున్నానంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి అంటున్నారని ఉత్తమ్ కుమార్ మండిపడ్డారు. వినతిపత్రాలు ఇవ్వాలంటూ సీఎం అపాయింట్ మెంట్ తీసుకుని, తీరా సీఎం చాంబర్లోకి వెళ్లాక ల్యాండ్ సెటిల్మెంట్ గురించి మాట్లాడింది ఎవరని ఎద్దేవా చేశారు. తాను వెయ్యి కోట్లు తీసుకున్నట్టు ఆరోపిస్తున్నారని, బీజేపీ శాసనసభాపక్ష పదవి కోసం ఆయనే ఢిల్లీకి డబ్బులు పంపారేమో అంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీకి డబ్బులు పంపే సంస్కృతి బీజేపీకే ఉందని, ఇకనైనా మహేశ్వర్ రెడ్డి నీచపు మాటలు మానుకోవాలని హితవు పలికారు



# గుట్కా తయారీ, అమ్మకానికి నిషేధం

## తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం

విశాలభారతి,హైదరాబాద్ :

తెలంగాణలో 2023 డిసెంబర్ లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ఆరోగ్య శ్రీ సేవల విలువను రూ.10లక్షలకు పెంచేసింది. అలాగే యువత పై ప్రభావం చూపుతున్న డ్రగ్స్, గంజాయిపై ఇప్పటికే ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా తెలంగాణ రాష్ట్రంలో గుట్కా తయారీ, అమ్మకాన్ని నిషేదిస్తూ.. ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఆ ఉత్తర్వుల్లో ఆహార భద్రత, ప్రమాణాల చట్టం, 2006లోని సెక్షన్ 30లోని సబ్ సెక్షన్ 2లో క్లాజ్ ఏ కింద అనుసరించిన అధికారాలను అమలు చేయడంలో 2,3,4 ఆహార భద్రత, ప్రమాణాలు, రెగ్యులేషన్ ప్రజారోగ్య దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్, పొగాకు, నికోటిన్, పౌచ్ లు, ప్యాకేజీ, కంటెయనర్లు మొదలైన వాటిలో ప్యాక్ చేసిన గుట్కా, పాన్ మసాలా తయారి, నిలువ, పంపిణీ, రవాణా, విక్రయాలను నిషేదించబడింది. నిర్ణయాలు తీసుకుంటుంది.

# తీన్మార్ మల్లన్నకు వైసీపీ ఎంపీ సపోర్ట్


- కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చిన ఆర్ కృష్ణయ్య
- హోరాహోరిగా సాగుతున్న ఎమ్మెల్సీ ఫైట్
- చివరి క్షణంలో అనూహ్య పరిణామం

విశాలభారతి,స్టేట్ బ్యూరో :

తెలంగాణలో ఎన్నికల జాతర నడుస్తోంది. మొన్నటివరకు లోక్ సభ ఎన్నికల హడావుడి కొనసాగగా.. జూన్ 4వ తేదీన వాటి ఫలితాలు వెలువడనున్నాయి. ఇదిలా ఉంటే.. రేపు (మే 27వ తేదీన) ఉమ్మడి నల్గొండ ఖమ్మం వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను రాష్ట్రంలోని మూడు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. అదే స్థాయిలో ప్రచారం కూడా నిర్వహించాయి. కాగా.. తెలంగాణలో జరుగుతున్న ఈ ఎమ్మెల్సీ ఉపఎన్నికలో.. కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ బరిలో దిగుతుండగా.. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్ రెడ్డి పోటీ చేస్తున్నారు.

అయితే.. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పలు సంఘాలు, పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ క్రమంలోనే.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య కూడా తన మద్దతు ప్రకటించారు. ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తన మద్దతు ఇస్తున్నట్టు ఆర్ కృష్ణయ్య ప్రకటించారు. రాష్ట్రంలోని అన్న వర్గాల సమస్యలు, అవినీతిపై ప్రశ్నించే గుణం ఉన్న వ్యక్తి తీన్మార్ మల్లన్న అని కృష్ణయ్య తెలిపారు. అలాంటి నాయకున్ని.. కులాలు, పార్టీలకు అతీతంగా గెలిపించాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ పార్టీకి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉన్న విషయం తెలిసిందే. ఇటీవలే ఏపీ కాంగ్రెస్ పగ్గాలు చేబట్టిన వైఎస్ షర్మిల.. ఎన్నికల ప్రచారంలో తన అన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇప్పటికీ చేస్తూనే ఉన్నారు. ఇలాంటి సందర్భంలో వైసీపీ రాజ్యసభ సభ్యునిగా ఉన్న ఆర్ కృష్ణయ్య.. కాంగ్రెస్ అభ్యర్థికి తన మద్దతు తెలపటం.. సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మరి.. కృష్ణయ్య చేసిన ప్రకటనపై వైసీపీ అధిష్ఠానం ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలి.



కాగా.. ఆర్ కృష్ణయ్య ఫక్తు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తి కావటంతో పాటు.. బీసీ సంక్షేమ సంఘానికి జాతీయ అధ్యక్షుడిగా ఉన్నాడు. ఈ క్రమంలోనే.. కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న బరిలో దిగటంతో.. ఆయనకు ఆర్ కృష్ణయ్య తన మద్దతు ప్రకటించారు.

# చట్టబద్ధంగా రైతులకు కనీస మద్దతు ధర అందిస్తాం

మొదటిపేజీ తరువాయి

ఫలితం రాబోయే రోజుల్లో దక్కనుందని తెలిపారు. ఆదివారం పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్కోట్ లోక్సభ నియోజకవర్గ పరిధిలోని ఓ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో భట్టి విక్రమార్క పాల్గొని ఎన్నికల సమావేశంలో ప్రసంగించారు.దేశంలో వరి, పత్తి, చెరకు రైతులకు మద్దతు ధర లభించడం లేదని, నరేంద్ర మోదీ నల్లచట్టాలు తెచ్చి వారి ధనాన్ని లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని భట్టి విక్రమార్క ఆరోపించారు. దేశంలోని నిరుద్యోగులకు అప్రెంటీస్ హక్కు కల్పిస్తూ కొత్త చట్టాన్ని తీసుకొస్తామన్నారు. దేశంలోని పట్టభద్రులు, డిప్లమో చేసిన వారందరికీ ఈ హక్కు ఇవ్వబోతున్నామన్నారు. దేశంలోని పబ్లిక్ ప్రైవేటు సెక్టార్లలో సుమారు 30 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు.

**నిరుద్యోగులకు ఏడాదికి లక్ష రూపాయలు**

ఆగస్టు 15 లోపు ఈ ఉద్యోగాలను ఇండియా కూటమి ప్రభుత్వం భర్తీ చేస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలు, ఆసుపత్రుల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. కోట్లాదిమంది నిరుద్యోగులకు ఏడాదికి లక్ష రూపాయల నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నెలకు రూ.8500 వేస్తామన్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలకు లభిస్తున్న రోజువారి కూలీలు రూ. 250 నుంచి రూ. 400కు పెంచడంతోపాటు ఆశ అంగన్వాడీ మహిళల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని వివరించారు

గత పదేళ్ల కాలంలో మోదీ 25 మందికి సంబంధించిన రూ. 16 లక్షల కోట్ల అప్పులు మాఫీ చేశారని భట్టి విక్రమార్క విమర్శించారు. ఆ విధంగా ఆయన 24 ఏళ్ల పాటు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసేందుకు సరిపడా డబ్బులను వారికి ఇచ్చారు అని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం 25 మందిని కుబేరుని చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాదిమంది దేశ ప్రజల్ని లక్షాధికారులని చేస్తుందని భరోసా ఇచ్చారు. మోదీ, అమిత్ షా ఆందోళనలో ఉన్నారని అభివృద్ధిని చూసి ఓటు వేయమని మోదీ అడగడం లేదని విమర్శించారు





## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ఆర్మూర్, విశాల భారతి** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 199899 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ మున్సిపల్ 6వ వార్డు పరిధిలో గల జి ఆర్ గార్డెన్ లో ఆదివారం నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పూర్వ విద్యార్థులు ఎన్నాళ్ల కెన్నాళ్లకో అన్నట్లుగా 25 ఏళ్ల సంవత్సరాలకు పూర్వ విద్యార్థులంతా కలిసి సిల్వర్ జూబ్లీ వేడుకలను అత్యంత ఆత్మీయంగా సంబురంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ అలనాడు వారికి విద్యా బుద్ధులు నేర్పిన పూర్వపు గురువూలను సమావేశానికి పిలిచి సన్మానించి సత్కరించారు. అంతకుముందు పూర్వ విద్యార్థులందరూ తమ పాఠశాల తీపి గుర్తులను, జ్ఞాపకాలను ఒకరినొకరు వేసుకొని, ఒకరికొకరు కుటుంబ విషయాలు పిల్లల విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని, పిల్లలకు వారి అదృష్టం మేరకు చదువుకోనివ్వాలని ఒత్తిడి తేవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఇట్టేడి మోహన్ రెడ్డి, వేల్పుల లక్ష్మీనారాయణ, గైని రవి, నరహరి, భూమేశ్వర్, మూడ అశోక్, సృజన్, లింబాద్రి, మహిపాల్, శ్రీకాంత్, ప్రకాష్, ప్రభాకర్, రాజు, ప్రతాప్, రాజేందర్, భాస్కర్, లతీఫ్, రషీద్, జనార్దన్ గౌడ్, రాజ్ కుమార్, శ్రీధర్, గంగాధర్, జహీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



## లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ షఫీకి డాక్టరేట్

**బాల్కొండ, విశాల భారతి:** గత 30 సంవత్సరాలుగా విద్యమతల్లికి సేవలందిస్తున్న బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ షఫీ కి డాక్టరేట్ వరించింది. చెన్నైలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నిర్వహించిన మేనేజ్మెంట్ ఎడ్యుకేషన్ కేటగిరీ విభాగంలో ఆయనకు డాక్టరేట్ లభించిందని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ డాక్టరేట్ ను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా స్వీకరించారని అన్నారు. తనకు డాక్టరేట్ ప్రకటించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, మరింత భాద్యత పెరిగిందన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్య విధానంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ విద్యార్థులకు మరింత సేవలు అందిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సన, సిబ్బంది ప్రకాష్ పాల్గొన్నారు.



## ఎల్ ఓ సి అందజేత

**ఆర్మూర్, విశాల భారతి** డొంకేశ్వర్ మండలంలోని నికాల్ పూర్ గ్రామానికి చెందిన గంట గంగాధర్ అనారోగ్యం కారణంగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఎల్ ఓ సి అవసరం ఉందని ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ కుమార్ రెడ్డికి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి 3 లక్షల రూపాయల ఎల్‌ఓసిని అందించారు. ఈ సందర్భంగా బాధితులు వినయ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ఆలయ ప్రాంగణం పరిశుభ్రం

■ ఉత్సాహంగా 47వ వారం స్వచ్ఛ కాలనీ కార్యక్రమం

**ఆర్మూర్, విశాల భారతి** ఆర్మూర్ జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం 47వ వారానికి చేరింది. ఈ వారం కాలనీలోని భక్త హనుమాన్ ఆలయ ప్రాంగణంలో కాలనీవాసులు ఉత్సాహంగా శ్రమదానం నిర్వహించారు. కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, ఆలయ కమిటి ప్రతినిధులు, కాలనీవాసులు కలిసి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో, పరిసరాల్లో శ్రమదానం నిర్వహించి ప్రాంగణాన్ని, పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఆలయంలో అడ్డదిడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను కట్టర్ తో కత్తిరించారు. పిచ్చి మొక్కలను, వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడుతూ గత 47 వారాలుగా స్వచ్ఛ కాలనీ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కాలనీని పరిశుభ్రంగా ఉంచుతున్నామని, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 50వ ఆదివారం ప్రజా ప్రతినిధులను, అధికారులను ఆహ్వానిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆలయ కమిటి అధ్యక్షులు శివరాజ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటి అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. కాలనీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, హనుమాన్ ఆలయ కమిటి అధ్యక్షులు శివరాజ్ కుమార్, కాలనీ కార్యదర్శులు కొంతం రాజు, రాజ్ కుమార్, ఆలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చిగురుమామిడి వ్యవసాయ శాఖ అధికారులు ఎక్కడ...?

■ ఫర్టిలైజర్, సీడ్ షాపుల్లో తనిఖీల జాడ ఏదీ...??

■ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం...



**చిగురుమామిడి, విశాల భారతి** మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారా లేరా అనే ఆలోచనలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఖరీఫ్ సీజన్ దగ్గరికి వచ్చినప్పటికీ రైతులకు కనీస అవగాహన కల్పించాలన్న ఆలోచన వ్యవసాయ శాఖ అధికారులకు లేదా అని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామాల వారిగా వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నప్పటికీ మండలంలోని 17గ్రామాల్లో ఇప్పటివరకు రైతులకు ఖరీఫ్ సాగు గురించి ఎలాంటి సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించకపోవడంపై రైతులు గుర్రుగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఫర్టిలైజర్స్,సీడ్ షాపులను తనిఖీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, అవేమీ తమకు పట్టనట్లుగా చిగురుమామిడి వ్యవసాయ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని, దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికే మండలంలో నకిలీ విత్తనాలు దొరికిన సంఘటనలు ఉన్నప్పటికీ చిగురుమామిడి వ్యవసాయ శాఖ అధికారులు ఎందుకు షాపులను తనిఖీ చేయటం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఇస్తున్న జీలుగు విత్తనాలను సైతం వ్యవసాయ శాఖ అధికారులకు దగ్గరగా ఉన్న వాళ్ళకే అంటగట్టారని, కనీసం మండలానికి ఎన్ని క్వింటళ్లు వచ్చాయో కూడా రైతులకు చెప్పకుండానే జీలుగు విత్తనాలు అయిపోయాయని చెప్పడంతో రైతులు నివ్వరపోతున్నారు. మండల ప్రజలకు సరైన సమాచారం ఇవ్వకుండానే జీలుగు విత్తనాలు ఎలా అయిపోతాయంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.చిగురుమామిడి వ్యవసాయ శాఖ అధికారులు ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జిల్లా కలెక్టర్ కు,మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్తున్నారు.



## ఆదర్శ పాఠశాల విద్యార్థినిని అభినందించిన కలెక్టర్

**సైదాపూర్, విశాల భారతి** మండలంలోని సోమారం ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాలలో 10 జీపీఏ సాధించి టాపర్ గా నిలిచిన విద్యార్థిని బోయిని భూమిక కలెక్టర్ పమేలా సత్పతిని కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినీ భూమికను శాలువాతో సన్మానించి అభినందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన భూమికకు తండ్రి సమ్మయ్య చనిపోయిన నుండి తల్లి లక్ష్మి కూలి పని చేసుకుంటూ చదివించింది. పదో తరగతి ఫలితాల్లో మంచి జీపీఏ సాధించడం గర్వ కారణమని భూమిక ను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఫర్హాన,మోసిన్, ఉపాధ్యాయులు ఉయ్యాల విష్ణువర్ధన్ గౌడ్ అభినందించారు.

## నెహ్రూ వర్ధంతి సందర్భంగా ప్రతి ఒక్కరు నివాళులర్పించాలి

■ రాజేంద్రప్రసాద్ యాదవ్



**వనపర్తి విశాల భారతి:** దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వంలో నెహ్రూకి నివాళులు అర్పించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమానికి మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు, బీసీ , ఎస్సీ ,ఎస్టీ ,మైనార్టీలు, మహిళలు యూత్ కాంగ్రెస్, సోషల్ మీడియా, కిసాన్, ఎన్ ఎస్ యు ఐ, వికలాంగులు, మత్స్య కార్మికులు, సేవాదళ్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు భారీ ఎత్తున పాల్గొనాలని కోరారు.



## బంజారా ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలో ఉన్న బంజారా ఉద్యోగులు తమ ఉద్యోగరీత్యా సొంత జిల్లాలో మరి కొంతమంది వేరే జిల్లాలో తమ విధులు నిర్వహిస్తున్నారు. భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఉమ్మడి నిజామాబాద్ డిస్ట్రిక్ట్ లో ఉన్న బంజర ఉద్యోగులు అందరు పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో కమ్మర్ పల్లి ఏఎస్ఓ దేవదాస్ తో పాటు భీమ్‌గల్ ఐటిఐ కాలేజీలో గత ప్రభుత్వంలో రెగ్యులరైన తిరుపతి లెక్చరర్ ని కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గంగారం, జనరల్ సెక్రటరీ రాజు,తిరుపతి,దేవదాస్, మూడ్ రమేష్,గణపతి,గణేష్ భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలో ఉన్న బంజారా ఉద్యోగులు అందరూ పాల్గొన్నారు.

## కొత్త క్రిమినల్ చట్టాలపై శిక్షణ

■ జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి



**వనపర్తి విశాల భారతి:** దేశంలో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యలలో భాగంగా కొత్తగా రూపొందించిన 1.భారతీయ న్యాయ సంహిత, 2.భారతీయ నాగరిక్ 3. సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం 2023లో ఈ మూడు చట్టాలు జూలై 1, 2024 నుండి అమలులోకి రానున్నాయి. అందువలన వనపర్తి జిల్లాలోని ఉన్న పోలీసు సిబ్బందికి అందరూ కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వారం రోజులపాటు శిక్షణ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి మాట్లాడుతూ.. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం, ఈ మూడు చట్టాలు భారత శిక్షా స్మృతి (IPC), 1860; క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (CrPC), 1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, 1872 లను రీప్లేస్ చేయనున్నాయి. ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సమకాలీన కాలం వాడుకలో ఉన్న సాంకేతికతలకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలు చేర్చడం జరిగిందన్నారు. ఈ మూడు కొత్త చట్టాలు నేరస్థులకు శిక్ష వేయడం కంటే బాధితులకు న్యాయం అందించడం పైనే దృష్టి పెడతాయి. ఈ మూడు కొత్త చట్టాలకు డిసెంబర్ 21, 2023న పార్లమెంట్ ఆమోదం లభించిందనీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబర్ 25, 2023న సమ్మతిని ఇవ్వడం జరిగిందన్నారు. తాజా సవరించిన చట్టాలను అమల్లోకి తీసుకురావడం ప్రభుత్వం చేసిన మంచి ప్రారంభమని ఎస్పీ అన్నారు. కొత్త చట్టాల వర్తింపు , నేరాలకు సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై పోలీసు శాఖకు చెందిన డిస్పీ నుండి కానిస్టేబుల్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇట్టి శిక్షణా కార్యక్రమాన్ని ఎస్సై వెంకటస్వామి, ఏఎస్ఐ భాష శిక్షణ ఇవ్వనున్నారు.



## పుష్ప సినిమా తరహాలో గంజాయి స్మగ్లింగ్

**అశ్వాపురం, విశాలభారతి :** అక్రమ రవాణాలో ఈ ముఠాది ఓ స్టైల్, పోలీసులను పక్కదారి పట్టించేందుకు ఖతర్నాక్ ప్లాన్ వేశారు. సినిమాల ప్రభావం జనాల మీద ఏమాత్రం ఉందో తెలియదు కానీ స్మగ్లింగ్ మీద మాత్రం బాగానే ఉంది. ఈమధ్య వచ్చిన స్మగ్లింగ్ నేపథ్యమున్న సినిమా పుష్ప ప్రభావం అయితే విపరీతంగా పండింది. పుష్ప సినిమాలో స్మగ్లర్ అయిన అల్లు అర్జున్ కొత్త కొత్త ఐడియాలతో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తే ఇక్కడ మాత్రం రియల్ స్మగ్లర్లు గంజాయిని పోలీసుల కంటపడకుండా రాష్ట్రాలు దాటిస్తున్నారు. కానీ పోలీసులు ఇచ్చే ట్విస్ట్ లతో అడ్డంగా దొరికిపోయి జైలు పాలవుతున్నారు.ఎవరికి ఎలాంటి అనుమానం పోలీసుల కళ్ళు కప్పి, ఎవరికి అనుమానం రాకుండా ప్రైవేట్ బస్సు క్యాబిన్ డిక్కీ కింద పెట్టి హైదరాబాద్ తరలిస్తున్న గంజాయి స్మగ్లింగ్ ముఠా సభ్యులను అశ్వాపురం మండలం సీతారాంపురం వద్ద పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. అశ్వాపురం మండలంలోని సీతారాంపురం గ్రామం వద్ద ఓ ప్రైవేట్ బస్సు క్యాబిన్ డిక్కీ కింద భాగంలో పెట్టి హైదరాబాద్ తరలిస్తున్న గంజాయి స్మగ్లింగ్ ముఠా సభ్యులను చాకచక్యంగా పక్కా ప్రణాళికతో పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. సుమారు రూపాయలు 66 లక్షల విలువైన 248.5 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గంజాయిని తరలిస్తున్న మహబూబ్ నగర్ జిల్లా కు చెందిన నరేష్ రెడ్డి, రవీందర్ జోరెడ్డి, భరత్ కుమార్ లను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి సెల్ ఫోన్లు, ప్రైవేట్ బస్సు వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

## రాకేష్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించండి

■ బిఆర్ఎస్ యువ నాయకులు గుగులోత్ ప్రకాష్ నాయక్



**కురవి, విశాలభారతి:** 27న జరుగునున్న వరంగల్ ఖమ్మం నలగొండ కట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మహబూబాబాద్ జిల్లా కురవి మండల బిఆర్ఎస్ యువ నాయకులు గుగులోత్ ప్రకాష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ యువ నాయకులు గుగులోత్ ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ.. వరంగల్ ఖమ్మంనలగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని భారత రాష్ట్ర సమితి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డిని పట్టభద్రుల విలువైన మొదటి ప్రాధాన్యత ఓటును రాకేష్ రెడ్డి కి వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే, ప్రశ్నించే గొంతు అయిన రాకేష్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మోసకారి తీన్మార్ మల్లన్నను గెలిపిస్తే పట్టభద్రులను నట్టేట్ట ముంచుతాడాని అన్నారు. ప్రశ్నించే గొంతు అని గొంతు చించుకుంటున్న మల్లన్న అధికార పక్షంలో ఉండి ఎట్లా ప్రశ్నిస్తాడని అన్నారు. మీడియాను అడ్డు పెట్టుకొని కోట్లు సంపాదించిన మల్లన్నను చిత్తుగా ఓడించాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు.



## నరసింహచారికి నివాళులర్పించిన సిపిఎం నాయకులు

**చిట్యాల, విశాలభారతి:** నేరడ గ్రామంలో నాగార్జున నరసింహ చారి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం నాడు మరణించడం జరిగింది. ఆయన పార్థివ దేహాన్ని సిపిఎం నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరము కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు అవిశెట్టి శంకరయ్య, కల్లూరి కుమారస్వామి, కందగట్ల గణేష్, పోలోజు ఈశ్వర చారి, పెందోట శంకరాచారి, చేన్నోజు పాండు, చెన్నోజు కృష్ణ చారి, చేన్నోజు లక్ష్మీనారాయణ, చెన్నోజు విష్ణుమూర్తి, చేన్నోజు వెంకటాచారి, చెన్నోజు సత్యనారాయణ, మారోజు యాదగిరి చారి, చెన్నోజు వీరమాచారి తదితరులు పాల్గొన్నారు.




## తాగునీటి సరఫరా కొరతను అధిగమించాలి

■ ఆరకొర తాగునీటితో ఇక్కట్లు పడుతున్న ప్రజలు

**గార్ల, విశాలభారతి:** మండల కేంద్రంలోని స్థానిక గార్ల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా కొరతను అధిగమించాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది మిషన్ భగీరథ తాగునీటిని రెండు లేక మూడు బిందెల కంటే మంచి నీటిని పంపిణీ చేయడం లేదని జనం ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఆ,యా వార్డుల ప్రజల ప్రతిరోజు తాగునీటిని సరఫరా చేయాలని సోషల్ మీడియా ద్వారా సంబంధిత గ్రామ పంచాయతీ సిబ్బందికి విజ్ఞప్తి చేస్తూ కోరుచున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాగునీటిని ప్రజలకు అంతరాయం లేకుండా సరఫరా చేయాలని నొక్కి చెబుతున్న, సిబ్బంది మాత్రం బేఖాతరు చేస్తున్నారు. తాగునీటి అవసర నిమిత్తం మహిళా సోదరీ మణులు ఖాళీ బిందెలతో రోడ్డుపై సందడి చేయక ముందే యుద్ధ ప్రాతిపదికన జనాలకు మంచి నీటిని అందజేయాలని సర్వత్ర వినవస్తున్నాయి. సంబంధిత జిల్లా అధికారులు చోరవ చూపి గార్ల మేజర్ గ్రామపంచాయతీ ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా తగునీరు పంపిణీ చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.



# ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

**దేవరుప్పుల, విశాలభారతి:** బంజర గ్రామంలో హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన హనుమాన్ భక్తులు 41 రోజులు దీక్ష చేపట్టి నగర సంకీర్తనను(శోభాయాత్ర) ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి రోజు మాలాధారణ ధరించిన హనుమాన్ భక్తులు భక్తి శ్రద్ధలతో దీక్షలో ఉండి పూజలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా ఈరోజు హనుమాన్ గుడి నుండి నగర సంకీర్తన, గ్రామంలోని ప్రతి వీధి వీధికి తిరిగి భక్తిశ్రద్ధలతో భజనలతో శుభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయస్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని, గొడ్డు గోదా సల్లంగా ఉండాలని, ఆ స్వామి కృపతో అందరూ బాగుండాలని వేడుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దీకొండ. విష్ణు, జటంగి. చిన్న వీరయ్య, పరశురాములు, వినయ్, వడ్లకొండ రాజు, పడకంటి. బ్రహ్మచారి, జోగు. అర్జున్, విక్రం, పట్టూరి గంగయ్య, గుగులోతు నరేందర్, మాలోతు. మధుసూదన్, మెడ గుజ్జుల. శేఖర్, భూక్య నర్సింగ్, ధరావత్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలి

- ఎలక్షన్ ప్రక్రియలో మైగ్రో అబ్జర్వ్ వల్ల పాత్ర కీలకం
- జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు



**సూర్యాపేట, విశాలభారతి:** ఎమ్మెల్సీ ఎన్నికలలో మైక్రో అబ్జర్వ్ పాత్ర కీలకమైనదని, ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తూ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్ల కు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, ఆదనపు కలెక్టర్లు సిహెచ్ ప్రియాంక, బిఎస్ లత తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వ్ పాత్ర కీలకమైనదని వీరు జనరల్ అబ్జర్వర్ పర్యవేక్షణలో ఉంటూ పోలింగ్ ప్రక్రియను సూక్ష్మంగా పరిశీలిస్తూ పోలింగ్ ప్రక్రియ నిర్వహించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లు, ప్రొసీడింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలక్షన్ సజావుగా నిర్వహించాలన్నారు. 11 అంశాలతో కూడిన చెక్ లిస్టును పోలింగ్ రోజున నింపి, పోలింగ్ ముగిసిన తరువాత జనరల్ అబ్జర్వర్కి అందజేయాలని తెలిపారు. అలాగే మరొక ముఖ్య కార్యక్రమం పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ నిర్వహించే ముందుగా జంబో బ్యాలెట్ బాక్సులను ఖాళీగా ఉందని ఏజెంట్లకు చూపించాలని, అలాగే పోలింగ్ ముగిసిన తర్వాత సీల్ చేయడం దానిపై ఏజెంట్లతో సంతకాలు తీసుకోవడం కూడా కీలకమైన అంశమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో ప్రతి పోలింగ్ స్టేషన్కు ఒక మైక్రోబ్ జార్వర్, ప్రతి స్టేషన్ లో వెబ్ కాస్టింగ్ నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నంత వరకు సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఒక పోలీసు అధికారులు నియమించడం జరిగిందని, ఎలాంటి సమస్య తలెత్తిన వారికి తెలియజేయాలని ఎస్పీ తెలిపారు. పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్దనే ఉండాలని ఎస్పీ సూచించారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్ట పర్యవేక్షణకు జిల్లాలో 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు 144 సెక్షన్ విధించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, మాస్టర్ ట్రైన్ రమేష్, మైగ్రూప్ జార్వర్లు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# అనసూయమ్మకి నివాళులర్పించిన మందకృష్ణ

**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మున్సిపాలిటీ కో ఆప్షన్ మేంబర్ పాటి మాధవ రెడ్డి, ఈనాడు విలేకరి పాటి మోహన్ రెడ్డి తల్లి పాటి అనసూయమ్మ గత కొద్ది రోజుల క్రితం మృతి చెందడం జరిగింది. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పరామర్శించి అనసూయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి గటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నకిరేకల్ ఇంచార్జీ మేడి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్, జిల్లా నాయకులు నోముల పురుషోత్తం, జిట్ట రవి, రుద్రవరం లింగస్వామి, జిట్ట దశరథ, పొలిమేర దశరథ తదితరులు పాల్గొన్నారు.



# పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**మహబూబాబాద్, విశాలభారతి:** నల్గొండ ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజక వర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మే 27 న నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు కొనసాగుతుందని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని పట్టభద్రుల ఓటర్లు వారి ఓటును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలా ఓటు వేయాలనే సమాచారాన్ని తెలిపే బ్యానర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేకమైన పెన్నును ఉపయోగించి ఓటు వేయవలసిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు కలవని ప్రతి ఒక్క పట్టభద్రుల ఎన్నికల నిబంధనలు పాటిస్తూ ఓటు వేయవలసిందిగా పట్టభద్రుల ఓటర్లకు సూచించారు. ఆదివారం రోజు ఫాతిమా హైస్కూల్ మహబూబాబాద్ నందు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్ అదనపు కలెక్టర్లు లోకల్ బాడీ, రెవెన్యూ లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్ ల పర్యవేక్షణలో పోలింగ్ బ్యాలెట్ బాక్స్ లను డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుండి పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరిగిందని అన్నారు.



# విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

- బడుగుల లింగయ్య యాదవ్

**సూర్యాపేట, విశాలభారతి:** విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, చదువు ద్వారానే పేదరికం రూపుమాపవచ్చు అని మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, శ్రీకృష్ణ యాదవసేవ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్ లో శ్రీకృష్ణ యాదవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు, సన్మాన, కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమం అనంతరం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద, మధ్యతరగతి యాదవ కుటుంబాల విద్యార్థులను బలోపేతం చేయడానికి ప్రతి సంవత్సరం నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. పేదరికం సాకు చూపుతూ చదువును ఆపవద్దని హితవు పలికారు. యాదవులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఏ ప్రభుత్వంలోనైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యాదవ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడం కోసమే శ్రీకృష్ణ యాదవసేవ ట్రస్ట్ లక్ష్యంగా పని చేస్తుందన్నారు. భవిష్యత్ తరాలకు విద్యార్థులు ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. సూర్యాపేట జిల్లా యాదవ విద్యార్థులకు భవన నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎంతోమంది యాదవులకు భవన ఉపయోగపడేలా నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ రేఖ సత్యం యాదవ్, మర్యాద సైదులు యాదవ్, పోలే బోయిన నరసయ్య యాదవ్, ఎలగబోయిన మధు యాదవ్, వజ్జే వీరయ్య యాదవ్, జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, గొడ్డేటి సైదులు యాదవ్, చలపతిరావు, రాము యాదవ్, వగ్రె సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప ఎన్నికకి పటిష్ట బందోబస్త్ ఏర్పాటు

- పట్టభద్రుల ఉప ఎన్నికలకు 1100 మంది పోలీసు భద్రత



**నల్లగొండ, విశాలభారతి:** సోమవారం నిర్వహించనున్న పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని రకాల భద్రతా చర్యలను పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఐపిఎస్ తెలిపారు. ఈ సందర్భంగా యస్.పి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఉప ఏన్నికలకు జిల్లా వ్యాప్తంగా సజావుగా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించుటకు జిల్లా ఎస్పి పర్యవేక్షణలో ఒక అడిషనల్ ఎస్పీ 5 గురు డీఎస్పీలు 22 మంది సిఐలు 64 మంది ఎస్.ఐల తో కలిపి మొత్తం 1100 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని 97 పోలింగ్ కేంద్రాలలో జరగబోయే ఓటింగ్లో పట్టభద్రుల నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, మంటను ప్రేరేపించే వస్తువులకు అనుమతి లేదని, ప్రజలంతా గమనించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ ను ఖచ్చితంగా అమలయ్యే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలియజేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఏఐవైఎఫ్ జిల్లా సమితి డిమాండ్



**పాలకీడు, విశాలభారతి:** 202425 విద్యా సంవత్సరానికిగాను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాడు ఆయన నేరేడుచర్లలో పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలు అనేక సమస్యలతో తాండవిస్తున్నాయని, ప్రధానంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు భయానకంగా ఉన్నాయని, కలుషిత నీటితో విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాధమున్నదని, బాలికల మరుగుదొడ్లకు సరైన సదుపాయాలు కూడా లేవని అన్నారు. పాఠశాలకు చుట్టూ చెత్తాచెదారాలతో అపరిశుభ్రంగా ఉన్నాయని, పాఠశాలలో నీటి సమస్య అతి ప్రధాన సమస్యగా ఉందని, తరగతి గదులలో ఉన్న అనేక బెంచ్ లు విరిగి, ఊడిపోయి ఉన్నాయని, తరగతి గదులకు ఎలాంటి భద్రతా లేకుండా పోయాయని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల మరమ్మత్తులకు , మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉన్నందున వేసవి సెలవులు పూర్తయ్యే లోపుగా ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తులను పూర్తి చేస్తే 2024 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.



# ఆదివాసి సదస్సును జయప్రదం చేయండి

- ఆదివాసి ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తిసత్యం పిలుపు

**బయ్యారం, విశాలభారతి:** లక్ష్మీపురంలో జిల్లా స్థాయి ఆదివాసి సదస్సు ఆదివాసీ సంఘం నాయకులు పూనెం బిక్షం, మోకాళ్ళ రమేష్ పోషాలు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో ఆదివాసి ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తిసత్యం పాల్గొని మాట్లాడుతూ.. ఆది వాసీలు ఈ దేశ మూల పురుషులు, ఆదివాసీలు అనేక సంవత్సరాల నుండి రకరకాల దోపిడికి వివక్షతకు అవమానాలకు, అణిచివేతకు గురి అవుతున్నారు. ఆదివాసీలు తమ హక్కుల రక్షణ కోసం అనేక సంవత్సరాలు పోరాడిన ఫలితంగా అనేక చట్టాలు ఏర్పడినాయి. వాటిని నేటి కేంద్ర ప్రభుత్వం ఆదివాసి చట్ట లను, హక్కులను విజయాలనుహరించి వేయడానికి రద్దు చేయడానికి తీవ్రమైనటువంటి ప్రయత్నాలను కొనసాగిస్తుంది. దీనిలో భాగంగానే అడవి సంరక్షణ నియమాల చట్టాన్ని తీసుకురావడం జరిగింది. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నటు వంటి రకరకాల ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు కట్టబెట్టడానికి ,వారి సంపదనుదోసుకపోవడానికి ప్రయత్నాలు చేస్తుందని దీనిలో భాగంగానే గత అనేక సంవత్సరాల నుండి ఆదివాసీలు సేద్యం చేసుకున్నటువంటి పోడు భూములను హరితహారం పేరుతో దుర్మార్గంగా ఆక్రమించుకుంటుందని అడ్డువచ్చిన ఆదివాసీ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ అవమానాలకు గురి చేస్తూ తప్పుడు కేసులు బనాయిస్తూ వారి భూముల లోనేవారినే పరాయి వారిగా సిత్రీకరిస్తూ బయటకు వెళ్లగొడుతున్నారని అన్నారు.

# పట్టభద్రులు ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలి

- బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బింగి రమేష్ యాదవ్



**మరిపెడ, విశాలభారతి:** పట్టభద్రుల ఎమ్మెల్సీ భాజపా అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు బింగి రమేష్ యాదవ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఇతర పార్టీల అభ్యర్థుల వలే కాకుండా 35 సంవత్సరాలుగా పార్టీకి కట్టుబడి నిజమైన కార్యకర్తగా పనిచేస్తున్న ఉన్నత విద్యావంతుడు పట్టభద్రుల సమస్యల పట్ల అవగాహన కలిగిన నాయకుడు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మన ఇంట్లో మనిషిగా కలిసిపోయే నాయకుడని, సమస్య ఏదైనా శక్తి వంచన లేకుండా పరిష్కారం కోసం కృషి చేసే నాయకుడని అటువంటి నాయకుడిని శాసన మండలికి పంపించాలని అన్నారు. నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి శాసనమండలి మన గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ డోర్నకల్ నియోజకవర్గ కన్వీనర్ ఆకుల హరికృష్ణ గౌడ్, ఓబీసీ మోర్చ మండల అధ్యక్షులు సొంటి రజినీ కాంత్ గౌడ్, సురేష్ ,నాగరాజు, కుమార్ ,పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

- కె.అశోక్ రెడ్డి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి



**హైదరాబాద్,విశాలభారతి:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో తెలంగాణ రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.అశోక్ రెడ్డి అన్నారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల ఫీజుల నియంత్రణకు క్రమబద్ధమైన విధానాన్ని తీసుకురావాలని, అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చూడటం లక్ష్యంగా పాఠశాల ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలలు ప్రతి విద్యాసంవత్సరంలో ఫీజులను పెంచుతున్నాయనీ, ప్రైవేట్ పాఠశాలల్లో పెరుగుతున్న విద్య ఖర్చులను ఎదుర్కొంటున్న తల్లి దండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం దీని ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) తరహాలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పర్యవేక్షణ, నియంత్రణ కమిటీ వేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లెనిన్, ఉపాధ్యకుడు నాగేందర్, శ్రీమాన్, సహాయ కార్యదర్శి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



# పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు

**సూర్యాపేట, విశాలభారతి:** ఈ నెల 27వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే ఐపిఎస్ తెలిపినారు. ఆదివారం ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన రిషప్షన్ సెంటర్ నందు పోలీసు సిబ్బందికి బందోబస్తు ప్రణాళిక, విధులు నిర్వహణలో అనుసరించాల్సిన విధివిధానాలపై దిశా నిర్దేశం చేసి సలహాలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల సామాగ్రి తరలించడం, వాటికి రక్షణ కల్పించడం ప్రాథమిక విధి, మార్గం లో అన్ని స్థితి గతులు పరిశీలించాలి, ఇబ్బందులు వస్తే అధికారులకు, స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులకు సమాచార ఇవ్వాలి అన్నారు. పోలింగ్ బూత్ ను, మొబైల్ రూట్ వాహనాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలివెళ్లవద్దు అన్నారు. ఓటర్లను క్యూ లైనులో ఉంచాలని అన్నారు, పోలీసులు పోలింగ్ బూత్ అధికారి అనుమతి లేకుండా బూత్ లోకి వెళ్ళవద్దు అని సూచించారు. ఇతరులను పోలింగ్ బూత్ లోకి అనుమతించద్దు. ఓటర్లతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. ఎస్పి వెంట అదనపు ఎస్పీ నాగేశ్వర రావు, డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, ఎలక్షన్ సెల్ ఇన్స్పెక్టర్ పాండరి, సిఐ రాజశేఖర్ ఉన్నారు.



# అక్రమ బదిలీలను నిలిపివేయాలి

- ఏఐటియు పి వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మల్లెల రామ నరసయ్య

**మణుగూరు విశాలభారతి :** ఏరియాలో అక్రమ బదిలీలను నిలిపివేయాలని ఏఐటియుపి వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మల్లెల రామ నరసయ్య అన్నారు. ఆదివారం పీవీ కాలనీ కామ్రేడ్ కే ఎల్ మహేంద్ర భవన్ నందు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం ఇష్టారీతిన బదిలీలు చేస్తూ కార్మికులను ఇబ్బంది లకు గురి చేస్తుందని దీనివలన కార్మికులు ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. బదిలీలలో పారదర్శకత పాటించకుండా కేవలం కొందరికి ప్రయోజనం కల్పించడం కొరకే ఈ బదిలీలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్ నంబూరు శ్రీనివాసరావు, గోలి గంగాధర్ రావు, అబ్దుల్ సుభాని ,ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, ఫిట్ సెక్రటరీలు గుండ్లపల్లి శరత్, దండు వీర విజయ్ కుమార్, గడ్డం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# పెట్రోల్ బంకు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి** మంచాల మండలంలోని ఆగపల్లి గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. నాణ్యమైన పెట్రోల్, డీజిల్ను వినియోగదారులకు అందించాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో బంకు యజమాని కటకం చంద్ర శేఖర్, శ్రీనితిన్, నాయకులు ఆకుల ఆనంద్ , ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగరి విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించాలి

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

**కూకట్ పల్లి,విశాలభారతి:** భావితరాలకు మార్గదర్శకంగా ఉండాల్సిన నేటి యువత గంజాయి ఊబిలో చిక్కుకుని వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం సతీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర నాయకుడు ఆనగంటి వెంకటేష్, మేడ్చల్ జిల్లా నాయకుడు శ్రీకాంత్, మండల కార్యదర్శి చైతన్యరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు, యువత నిర్ణీత లక్ష్యాలతో ముందుకు సాగాల్సిన వారని, కాగా నేడు గంజాయికి బానిసలుగా మారుతున్నారని, దేశవ్యాప్తంగా ఆల్కహాల్ తరవాత ఎక్కువ మంది గంజాయికి వ్యసనపరులుగా మారుతున్నారని, అందులో ముఖ్యంగా యువత ఉన్నారన్నారు. వారి పిల్లల భవిష్యత్తు ఎంటో తెలియని స్థితిలో తల్లిదండ్రులు కొట్టుమిట్టాడుతున్నారని ఆయన వాపోయారు. రాష్ట్రంలో గంజాయిని నిర్మూలించే విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసినప్పటికీ గంజాయి విక్రయదారులు రెచ్చిపోతున్నారని అన్నారు. ఇటీవలి కాలంలో గంజాయితో పట్టుబడ్డ నిందితుల్లో ఎక్కువగా విద్యార్థులు ఉండటం మరింత కలవరపాటుకు గురిచేస్తోందని, భావితరం గంజాయి ఊబిలో కూరుకుపోతోందని తెలియజేశారు. తొలుత ఆ మత్తుకోసం, అనంతరం దాని ద్వారా ధనం సంపాదించడానికి అడ్డదారులు తొక్కుతూ నేటి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటటూ తల్లిదండ్రులకు తీరని శోఖాన్ని మిగులుస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం గంజాయిని నిర్మూలించడంలో ఉపేక్షించక మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి చర్యలు చేపట్టి భావితరాలకు బంగారు భవిష్యత్తును నిర్మించాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీమాన్ ఉపాధ్యక్షులు మల్లేష్, నరేష్ సహాయ కార్యదర్శి వంశీ, అభి, రాజు కోశాధికారి బన్నీ కమిటీ సభ్యులు టైని, సాయిసాగర్, అనిల్, సాయికుమార్, మురళీ, లక్ష్మణ్, రాజేందర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలు సంస్కృతీ సంప్రదాయాలకు తార్కాణాలు

- ఇబ్రహీంపట్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** ఆలయాలు సంస్కృతీ సంప్రదాయాలకు తార్కాణాలు , వీటితో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఇబ్రహీంపట్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం మండలంలోని గున్గల్ గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవాలయం మొదటి వార్షికోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ దేవాలయాలను సందర్శించడానికి కొంత సమయాన్ని కేటాయించాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని గుర్తుచేశారు. ఆలయాలు భారత సంస్కృతీ సంప్రదాయాలకు తార్కాణాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కొత్తకుర్మ శివకుమార్ , వైస్ ఎంపీపీ కే. శ్రీనివాస్ , మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు , మాజీ వైస్ ఎంపీపీ గజ్జె రామకృష్ణ , నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## త్రోబాల్ ఛాంపియన్ షిప్ పోస్టర్ ను ఆవిష్కరణ

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్.

**కూకట్ పల్లి, విశాలభారతి :** సీనియర్ నేషనల్ 47 వ త్రోబాల్ ఛాంపియన్ షిప్ పోస్టర్ ను, జెర్సీని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్.నగరంలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ ఆదివారం గౌడ్ చేతుల మీదుగా హైదరాబాద్ హయత్‌నగర్‌లోని వర్ద్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ అకాడమీలో జూన్ 6 నుంచి 8 వరకు జరిగే 47 వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ షిప్ పోస్టర్ ను మరియు జెర్సీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆర్గనైజింగ్ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి కుమార్, కోశాధికారి జమీల్, వైస్ ప్రెసిడెంట్స్ కృష్ణ రాజ్ పుత్, చిత్ర షెనోయ్, జాయింట్ సెక్రటరీ సిహెచ్. శ్రీనివాస్, అరుణ్ గౌడ్, రాము మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:** యాచారం మండలంలోని నందివనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1988_89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 35 సంవత్సరాలైన సందర్భముగా ఆదివారం ఓ కాన్ఫరెన్స్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారి గత స్మృతులు మాట్లాడుకొని ఆత్మీయంగా పలుకరించుకుని విందు, వినోదాలతో సాయంత్రం వరకు సందడిగా గడిపారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. భవిష్యత్ లో తరచుగా కలుసుకొని అలాగే కష్టములో ఉన్న స్నేహితులకు సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమం లో వెంకటేష్, రంగారెడ్డి ,విజయనాథ్,ప్రవీణ్ ,అరుంధతి, వేణు, చారి,సద్గుణ,సుధీర్ ,నర్మద, జయసుధ,యాదగిరి, సింహయ్య ,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇఎస్ఐ, ఈపీఎఫ్ సరిగా అమలు చెయ్యని కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలి

- టీ.మహేందర్ సిఐటియూ ఓయూ యూనియన్ అధ్యక్షులు.



**సికింద్రాబాద్ విశాలభారతి:** ఉస్మానియా యూనివర్సిటీ లో ఇఎస్ఐ,ఈపీఎఫ్ సరిగా అమలు చెయ్యని కాంట్రాక్టర్ లపై చర్యలు తీసుకోవాలని సిఐటియూ ఓయూ ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉస్మానియా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ యూనియన్ సిఐటియూ అధ్యక్షులు టీ.మహేందర్ మాట్లాడుతూ ఓయులోని మెస్ మరియు హాస్టల్ లలో దాదాపుగా 382 మంది ఉద్యోగులు సైబెక్స్ , సాయి సెక్యూర్ , బి సెక్యూర్ వెంకటేశ్వర సంస్థ కాంట్రాక్టర్ ల పరిధిలో పని చేస్తున్నారు. వీరు టెండర్ తీసుకొని సంవత్సరం గడుస్తుంది .ఇప్పటి వరకు ESI,EPF సక్రమంగా అమలు చేయకుండా ,అలాగే ఉద్యోగి యొక్క కుటుంబ సభ్యుల పేర్లను ఒక్కరివి కూడా చేర్చకపోవడం దుర్మార్గమని అన్నారు. జీతాలు సమయానికి రాకపోవటం వలన కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించడం ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి జీతాలు ప్రతి నెల ఐదవ తారీకు లోపల రావాలని టెండర్ లో ఉన్న కాంట్రాక్టర్ లు 20 తారీకు దాటిన కూడా జీతాలు సకాలంలో వెయ్యడం లేదు, కాంట్రాక్టర్ లు విరి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అలాగే ESI, EPF అప్రూవల్ అయినట్టుగా చెప్పున్నారు. కానీ డబ్బులు కోత విధిస్తున్నారని , వీళ్ళకి ఇప్పటి వరకు ఎలాంటి మెసేజ్ గాని, ప్లే స్లిప్ గాని ఇవ్వలేదు, అలాగే ఉద్యోగి కుటుంబ సభ్యుల పేర్లను కూడా ఇప్పటివరకు నమోదు చెయ్యకుండా కాంట్రాక్టర్లు మోసం చేస్తున్నారనిన్నారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్ ల లైసెన్స్ లను రద్దు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శిసీతారాం, ఉపాధ్యక్షులు శ్రీను నాయక్,నాగరాజు,సహాయ కార్యదర్శులు నరేష్,శివ,లక్ష్మణ్ ,రాజు పాల్గొన్నారు.


## రాజస్థాన్‌లో 50 డిగ్రీలు దాటిన ఎండలు

**విశాలభారతి రాజస్థాన్:**

రాజస్థాన్‌లో పగటి ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అవుతున్నాయి. భానుడి భగభగలకు వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజస్థాన్‌లోని ఫలోడిలో గత 24 గంటల్లో 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు జైపూర్ వాతావరణ శాఖ డైరెక్టర్ రాధేశ్యామ్ శర్మ వెల్లడించారు. ఈ ఏడాది ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం ఇదే ఫలోడీలో 49 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. రాబోయే రెండు మూడు రోజుల పాటు ఈ స్థాయిలోనే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. 29వ తేదీ నుంచి 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని డైరెక్టర్ రాధేశ్యామ్ పేర్కొన్నారు. భారీ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గుండె జబ్బులు ఉన్నవారు చల్లని ప్రదేశాల్లో ఉంటే మంచిదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాలని సూచన చేశారు.

## దేశంలో కరోనా కొత్త వేరియంట్ కేసులు

- కేపీ.1, కేపీ.2 వేరియంట్లకు సంబంధించి 325 నమోదు
- కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిత్వశాఖ కీలక ఆదేశాలు



**విశాలభారతి జాతీయం:**

దేశంలోని కొత్త వైరస్ కేసులు నమోదైన నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుతం వారంరోజుల పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ర్యాండమ్‌గా శాంపిల్స్ తీసుకుని సర్వే చేపట్టనున్నారు. మారిన కొవిడ్ స్వరూపం కారణంగా ప్రమాదం, ఆందోళన కలిగించే విషయం కాదని ఆరోగ్యశాఖ మంత్రిత్వ శాఖ చెందిన అధికారులతో పాటు నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జూన్ రెండోవారంలో జరిగే ర్యాండమ్ శాంపిల్ సర్వే నివేదిక ఆధారంగా తర్వాత వ్యూహాన్ని రూపొందించనున్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖలో జరిగిన కీలక సమావేశంలో కొవిడ్ మారిన రూపం ద్వారా ప్రభావితమైన రోగులు, రాష్ట్రాలపై చర్చించారు. సమాచారం మేరకు.. కేపీ.1, కేపీ.2 వేరియంట్లకు సంబంధించి 325 వెలుగులోకి వచ్చాయి. ఇందులో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 34 కేపీ.1 వేరియంట్ కేసులు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా బెంగాల్‌లోని 23 కేసులు రికార్డయ్యాయి. మహారాష్ట్రలో నాలుగు, గుజరాత్, రాజస్థాన్ ఇద్దరికి వైరస్ సోకినట్లు గుర్తించారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. గోవా, హర్యానా, ఉత్తరాఖండ్‌లో కొత్త వేరియంట్ కేసులు ఒక్కొక్కటి చొప్పున నమోదయ్యాయి. ఇక దేశంలో ఇప్పటి వరకు సుమారు 290 కేపీ.2 వేరియంట్ కేసులు నమోదవగా.. ఇందులో మహారాష్ట్రలోనే 148 కేసులు నమోదయ్యాయి.

## తల్లి పాలను విక్రయిస్తే కఠిన చర్యలు

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా' హెచ్చరిక



**విశాలభారతి ఢిల్లీ:**

ఎవరైనా తల్లి పాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా' హెచ్చరించింది. FSS 2006 చట్టం ప్రకారం తల్లి పాలను విక్రయించడానికి అనుమతి లేదని, వాటిని ఉపయోగించి చేస్తోన్న వ్యాపార కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. తల్లి పాలను ప్రాసెస్ చేసి, విక్రయించేందుకు యత్నించే వ్యాపారులకు లైసెన్సులు జారీ చేయొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది పాలిచ్చే తల్లుల నుంచి పాలను సేకరించి ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రభుత్వం పాల బ్యాంకులను నిర్వహిస్తోందని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. అవసరంలో ఉన్న చిన్నారులకు వాటిని అందించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుంటే కొందరు వ్యాపారులు అధిక లాభాల కోసం ఆన్‌లైన్‌లో తల్లి పాలను విక్రయిస్తున్న ఘటనలు ఈ మధ్య అధికంగా వెలుగులోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పాల బ్యాంకులు సాధారణంగా ఆరోగ్యకరమైన దాతల నుంచి సేకరించిన పాలను ప్రాసెస్ చేస్తాయి. వాటిని నిల్వ చేయడానికి ముందు అధికారులు పోషక పదార్థాలను తనిఖీ చేస్తారు. ఇలా నిల్వ చేసిన పాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన శిశువులకు ఉచితంగా అందిస్తారు.

## వాయిస్ యాప్ ద్వారా ఏడుగురు విద్యార్థినులపై అత్యాచారం

- మహిళా ప్రొఫెసర్‌గా విద్యార్థినులతో మాట్లాడిన వైనం
- బుల్డోజర్ ద్వారా నిందితుడిని ఇంటిని కూల్చివేసిన అధికారులు




**విశాలభారతి మధ్యప్రదేశ్:**

స్కాలర్‌షిప్ పొందేందుకు సహాయం చేస్తానని ఒక వ్యక్తి వాయిస్ యాప్ ద్వారా మహిళా ప్రొఫెసర్‌గా విద్యార్థినులతో మాట్లాడి మోసం చేశాడు. ఏడుగురు విద్యార్థినులపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఒక బాధితురాలి ఫిర్యాదుతో నిందితుడు, అతడికి సహకరించిన వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని సిధి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బ్రజేష్ కుష్వాహా నిరక్షరాస్యుడు. అయితే సాంకేతిక పరిజ్ఞానంతో కాలేజీ అమ్మాయిలను టార్గెట్ చేశాడు. తన వాయిస్ మార్ఫింగ్ చేసే యాప్‌ను బ్రజేష్ వినియోగించాడు. మహిళా ప్రొఫెసర్ గొంతుతో గిరిజన కాలేజీ విద్యార్థినులతో మాట్లాడాడు. స్కాలర్‌షిప్ పొందేందుకు సహాయం చేస్తానని వారిని నమ్మించాడు. తాను పంపే వ్యక్తిని కలవాలని చెప్పాడు. అనుచరులు తీసుకువచ్చిన ఆ విద్యార్థినులను అడవిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. మరోవైపు ఒక బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు హెల్మెట్ ధరించడంతో గుర్తించలేదని చెప్పింది. అయితే అతడి చేతికి గ్లౌవ్స్ ధరించినట్లు క్లూ ఇచ్చింది. దీంతో దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు బ్రజేష్ కుష్వాహా, అతడి ముగ్గురు సహచరులను శనివారం అరెస్ట్ చేశారు. గతంలో మహారాష్ట్రలోని మిల్లులో అతడు పని చేసినప్పుడు చేతులకు కాలిన గాయాలయ్యాయని, అందుకే అతడు గ్లౌవ్స్ ధరిస్తున్నాడని తెలిపారు. ఏడుగురు విద్యార్థినులపై అత్యాచారానికి పాల్పడినట్లు దర్యాప్తులో తెలిసిందన్నారు.

## దయచేసి మా దేశాన్ని ఆదుకోండి

ధనిక దేశాలను కోరిన మాల్దీవుల అధ్యక్షుడు



**విశాలభారతి జాతీయం:**

అంతర్జాతీయ సమాజం నుంచి తమ దేశానికి ఆర్థిక సాయం అందడం లేదని మాల్దీవుల అధ్యక్షుడు ముహమ్మద్ ముయిజ్జూ ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర మట్టాలు రోజు రోజుకు పెరిగిపోతుండటంతో పాటు వాటి నుంచి రక్షణ కల్పించేందుకు తమకు ధనిక దేశాలు సహాయం అందించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా 0.003 ఉద్గారాలు మాత్రమే మాల్దీవుల నుంచి వెలువడుతున్నాయి.. కానీ పర్యావరణ సంక్షోభం, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీవ్రంగా నష్టపోతున్న దేశాల్లో మాల్దీవులు తొలి స్థానంలో నిలుస్తుందని ముయిజ్జూ ఆవేదన వ్యక్తం చేశారు. ధనిక దేశాలు మానవతా దృక్పథంతో సాయం చేసి మాల్దీవుల లాంటి దేశాలను ఆదుకోవాలని వేడుకున్నారు. ధనిక దేశాల సాయం లేకుండా ఈ మొత్తాన్ని సమకూర్చుకోవడం తమకు తలకు మించిన భారమని మల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జూ పేర్కొన్నారు. ఇక, పర్యావరణ మార్పుల నుంచి బయటపడేందుకు మాల్దీవులు అనేక చర్యలు చేపట్టింది. దాదాపు 30 వేల అపార్ట్మెంట్లతో రాస్ మాలే పేరిట ఓ కృత్రిమ ద్వీపాన్ని సైతం నిర్మాణం చేపట్టింది. ఇందులో అనేక నిర్మాణాలను డ్రాగన్ కంట్రీ చైనా సంస్థలకే కట్టబెట్టింది.

# ఆగిపోయిన 'సలార్ 2'.. క్లారిటీ ఇచ్చిన టీమ్



బాహుబలి తర్వాత 'సలార్'తో ఆ రేంజ్‌లో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు రెబల్‌స్టార్ ప్రభాస్. కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ థ్రిల్లర్ మరోసారి డార్లింగ్ స్టామీనాను ఇండస్ట్రీకి చాటిచెప్పింది. బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.700 కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. ప్రభాస్‌కు, ఆయన అభిమానులకు ఎన్నో తీపి జ్ఞాపకాలను అందించింది. అయితే ఈ సినిమాకు సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. మొదటి పార్ట్ సలార్: పార్ట్ 1 - సీజ్ ఫైర్ అంటూ రాగా.. సలార్: పార్ట్ 2శౌర్యంగ పర్వం అంటూ రాబోతుంది. అయితే పార్ట్ 2 అనౌన్స్ చేశారు కానీ ఇప్పటివరకు అయితే సెట్స్ మీదకి వెళ్లలేదు. ఇక ఈ మూవీ షూటింగ్ ఎప్పుడు స్టార్ట్ అవుతుందా.. ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఏమైందో తెలీదు కానీ సడెన్‌గా ప్రభాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌కు మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ వచ్చాయని, దీంతో ఎవరి దారి వారు చూసుకున్నారని అంతా అన్నారు. దీంతో ఈ మూవీ షూటింగ్ ఆగిపోయిందంటూ వార్తలు రావడం మొదలయ్యాయి. ఈ సినిమా కాకుండా ప్రభాస్ కూడా వేరే మూవీ ఒకే చెప్పినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలకు కౌంటర్‌గా మూవీటీమ్ తాజాగా క్లారిటీ ఇచ్చింది. సలార్ ఆగిపోయింది అని వస్తున్న వార్తలు అబద్ధం. ఇవీ ఫేక్ సలార్ సెట్‌స్‌లో ప్రభాస్ ప్రశాంత్ నీల్ నవ్వుతూ కనిపించిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ పోస్ట్‌కు 'వారు నవ్వకుండా ఉండలేరు' అంటూ క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ రూమర్స్‌కు చెక్ పెట్టినట్లయింది.



# సంబురంలో మహేష్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు కొడుకు గౌతమ్ గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నాడు. విదేశాల్లో చదువుకుంటున్న గౌతమ్ రీసెంట్ గా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నాడు. ఈ కాన్వొకేషన్ కార్యక్రమంలో మహేష్ బాబు, నమ్రత, సితార పాల్గొన్నారు. దీనిపై మహేష్ బాబు సంతోషం వ్యక్తం చేశాడు. "నా హృదయం గర్వంతో ఉప్పొంగిపోతోంది. నువ్వు విజయవంతంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినందుకు కంగ్రాచ్యులేషన్స్ గౌతమ్. తదుపరి అధ్యాయం నీ కోసం ఎదురుచూస్తోంది. అందులో కూడా నువ్వు మరింత ప్రకాశవంతంగా వెలిగిపోతావని నాకు నమ్మకంగా ఉంది". అంటూ తన ఇన్ స్టాలో పోస్ట్ చేశారు. తనయుడు గౌతమ్ కాన్వొకేషన్ కార్యక్రమానికి హాజరైన ఫొటోలు షేర్ చేశాడు.

# మాస్ ప్రేక్షకులను మెప్పించే "గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి"

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం "గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి". శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. వెంకట్ ఉప్పటూరి, గోపీచంద్ ఇన్నమూరి సహ నిర్మాతలు. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నేహా శెట్టి, అంజలి కథానాయికలుగా నటిస్తున్నారు. ప్రముఖ స్వరకర్త యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు. భారీ అంచనాలతో మే 31వ తేదీన "గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి" చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ కు విశేష స్పందన లభించింది. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన ప్రముఖ నటి అంజలి.. చిత్ర విశేషాలను పంచుకున్నారు. థాంక్యూ అండీ. ఈ పాత్ర చేయడం నాక్కూడా కొత్తగా ఉంది. ఇలాంటి పాత్ర చేయడం, ఈ తరహా సంభాషణలు నా నోటి నుంచి రావడం ఇదే మొదటిసారి. అసలు ఈ సంభాషణలు నిజంగా సినిమాలో ఉంచుతారా అనుకున్నాను. చిత్రీకరణ, డబ్బింగ్ సమయంలో కొత్త అనుభూతిని పొందాను. పాత్రను మలిచిన తీరు చాలా బాగుంటుంది. కృష్ణ చైతన్య మొదటిసారి కలిసి ఈ కథ చెప్పినప్పుడు.. ఈ పాత్రకు నన్ను ఎంపిక చేయడానికి కారణం ఏంటని అడిగాను. ఎందుకంటే నన్ను ఎక్కువగా అందరూ పక్కింటి అమ్మాయి తరహా పాత్రలలో చూడాలి అనుకుంటారు. కానీ ఈ పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. అయితే చైతన్య ఏమన్నారంటే.. నాకు అద్భుతంగా నటించే నటి కావాలి, అందుకే మీ దగ్గరకు వచ్చాను, మీరు ఈ పాత్రకు న్యాయం చేయగలరు అన్నారు. ఆయన ఏ నమ్మకంతో చెప్పారో తెలియదు కానీ.. ఇంత మంచి పాత్ర పోషించినందుకు సంతోషంగా ఉంది. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలు పోషించడం నాకు నచ్చదు. ఈ పాత్రలోని వైవిధ్యమే నన్ను ఈ సినిమా చేయడానికి అంగీకరించేలా చేసింది. రత్నమాల తరహా పాత్రలు నిజ జీవితంలో ఎక్కడో ఒక దగ్గర తారసపడతాయి. నేను అమ్మమ్మ గారింటికి వెళ్ళినప్పుడు చూశాను. దేనిని లెక్క చేయకుండా పైకి రఫ్ గా కనిపిస్తారు.. కానీ వాళ్ళ మనసు మాత్రం చాలా మంచిది. రత్నమాల పాత్రలోకి వెళ్ళడానికి కాస్త సమయం తీసుకున్నాను. లుక్స్ పరంగా, డైలాగ్ డెలివరీ పరంగా ఈ పాత్ర కోసం ఎంతో కష్టపడ్డాను. నిజంగానే మా పాత్రలు పోటాపోటీగానే అనిపిస్తాయి. సినిమాలో విశ్వక్ ఎంత గట్టిగా మాట్లాడతారో.. అంతకంటే గట్టిగా నేను మాట్లాడతాను. ట్రైలర్ లో గమనిస్తే మీకు ఆ విషయం అర్థమైపోతుంది. అయితే ఈ సినిమాలో హీరో, హీరోయిన్ లేదా ఫలానా పాత్ర అని కాకుండా.. అన్ని పాత్రలు బలంగా, కథలో కీలకంగా ఉంటాయి.



# 31న ఆనంద్ దేవరకొండ "గం..గం..గణేశా"

ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ "గం..గం..గణేశా" ఈ నెల 31న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర పంపిణీ సంస్థలను ఖరారు చేశారు. "గం..గం..గణేశా" సినిమాను నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్, ఏపీ, కర్ణాటకలో ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. పలు భారీ, సక్సెస్ ఫుల్ సినిమాలను పంపిణీ చేసిన మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ ద్వారా తమ సినిమా విడుదల కావడం సంతోషంగా ఉందని "గం..గం..గణేశా" టీమ్ చెబుతున్నారు. "గం..గం..గణేశా" లో ఆనంద్ సరసన ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్స్ గా నటించారు. ఈ సినిమాను హైలైఫ్ ఎంటర్ టైన్ మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించగా..ఉదయ్ శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సెన్సార్ నుంచి క్లీన్ యు సర్టిఫికెట్ పొందిన "గం..గం..గణేశా" సకుటుంబ ప్రేక్షకులకు వినోదాన్ని పంచేందుకు సిద్ధమవుతోంది.






# నాలోని కొత్తకోణాన్ని ఆవిష్కరించిన చిత్రం లవ్, మౌళి

సూపర్ టాలెంటెడ్ యాక్టర్ నవదీప్ సరికొత్త అవతార్‌లో నవదీప్ గా 2.Oగా కనిపించబోతున్న చిత్రం లవ్,మౌళి. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలు, ప్రమోషన్ కంటెంట్ లో అందరిలోనూ సినిమా చూడాలనే ఆసక్తిని పెంచాయి. ఈ విభిన్నమైన, వైవిధ్యమైన ఈ చిత్రానికి అవనీంద్ర దర్శకుడు. ఈ చిత్రాన్ని నైరా క్రియేషన్స్ మరియు శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్ తో కలిసి నిర్మాణ పనులు టాలీవుడ్ టాలెంటెడ్ టెక్నిషియన్స్ కి అడ్డాగా మారిన సి స్పేస్ భాధ్యతలు తీసుకుంది. ఇటీవల సింగిల్ కట్ లేకుండా సెన్సారును పూర్తిచేసుకున్న ఈ చిత్రానికి సెన్సారు వారు 'ఏ' సర్టిఫికెట్‌ను అందజేశారు. కాగా నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్న ఈ చిత్రాన్ని జూన్ 7న విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసింది. సందర్భంగా నవదీప్ మాట్లాడుతూ అన్ని లాంగ్వేజ్‌లో రకరకాల కొత్త కంటెంట్‌తో సినిమాలు వస్తున్నాయి. అదే కోవలో తెలుగులో రాబోతున్న వైవిధ్యమన, విభిన్నమైన సినిమా ఇది. ప్రేక్షకులను థియేటర్‌కు రప్పించే సినిమా ఇది. ఆడియన్స్‌కు థియేటర్‌కు ఎందుకు రావాలో అన్న ప్రశ్నకు ఈ చిత్రంలో సమాధానం దొరుకుతుంది. చిరపుంజి, మేఘాలయాలోని అందరమైన ప్రదేశాల్లో షూట్ చేసిన చిత్రమిది. ఈ కథ విన్నప్పుడు అక్కడే చేయాలని అనిపించింది. ఎన్నో వ్యయ ప్రయసాలతో చిత్రీకరణ చేశాం. ఈసినిమా ప్రొడక్షన్ ఎలా జరిగింది అనే దాని మీద ఓ సినిమా తీయ్యెచ్చు. మంచి బ్యూటిఫుల్ సినిమా తీశామనే నమ్మకం కలిగింది. ఇక సినిమా ఫలితం ఆడియన్స్ చేతిలో వుంది కథ వినగానే నచ్చిన సినిమా ఇది. నా పర్సనల్ లైఫ్‌లో నా ప్రేమకథలు, నా లవ్‌స్టోరీల్లో వున్న పాయింట్‌ను టచ్ చేశాం. ఈ కథ, ఈ పాయింట్ కనెక్ట్ అయితే వాళ్ల పర్సనల్ లైఫ్‌లో ఎలాంటి మార్పులు వస్తాయో చూడాలని వుంది. ఈ 20 ఏళ్ల కెరీర్ తరువాత నాలో వున్న కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ చేసిన సినిమా ఇది. దర్శకుడు అవనీంద్ర మాట్లాడుతూ ఇందులో నేటి యువతరానికి కావాల్సిన అంశాలున్నాయి. ఈ చిత్రంలో అందరికి రిలేట్ అయ్యే అంశాలు, కనెక్ట్ అయ్యే అంశాలున్నాయి. ప్రేమలో వున్న వారి రిలేషన్స్ ఎలా వున్నాయి. నేటి యువతరం ప్రేమించి పెళ్లి చేసుకున్న బ్రేకప్‌లు అవుతున్నాయి. కాంప్రమైజ్ అయితే తప్ప రిలేషన్స్ నిలబడవా? అనే ప్రశ్నకు నాకు దొరికిన పరిష్కారాన్ని కూడా ఈ చిత్రంలో చూపెడుతున్నాం. ఈ సినిమా డీఐ కేరళలో జరుగుతున్నప్పుడు మంజుమ్మల్ బాయ్, ఆవేశానికి పనిచేసిన కలరిస్ట్ మా సినిమాకు పనిచేస్తున్నప్పుడు సినిమా చూసి ఎంతో అభినందించాడు. ఆయన అందించిన ప్రశంసలు మరువలేనిది. రేపు చిత్ర విడుదలైన తరువాత కూడా అందరికి నచ్చుతుందని ఆశిస్తున్నాను. ఈ సినిమా కోసం నవదీప్ చాలా కష్టపడ్డాడు. ఆయన అందుకు తగిన ప్రతిఫలం లభిస్తుందనే నమ్మకం వుంది అన్నారు.

# Vyrl సౌత్ రెండు కొత్త చార్ట్ బస్టర్స్ ను ఆవిష్కరించింది



VYRL సౌత్ అనేది యూనివర్సల్ మ్యూజిక్ ఇండియా నుండి వచ్చిన ఒక ప్లాట్‌ఫాం, సౌత్ ఇండియాలో ఐపాప్ మ్యూజిక్ కల్చర్ ని పరిచయం చేసి, దానికంటూ ఒక బేస్ ఉండేలా కృషి చేస్తుంది. ఒరిజినల్ కంటెంట్ తో, అర్థవంతమైన మ్యూజిక్ తో, క్లట్టర్ బ్రేకింగ్ స్లిక్ వీడియోస్ తో ఐపాప్ మ్యూజిక్ కోసం ఎదురు చూసే మ్యూజిక్ లవర్స్ అందరికీ ఏకైక డేస్టినేషన్ Vyrl సౌత్. ఈ లేబుల్ తన మొదటి రెండు సింగిల్స్ విడుదలతో తెలుగు సంగీత రంగంలో సంచలనాత్మక ప్రవేశం చేసింది. రెండు పాటలు సంగీత ప్రియుల హృదయాలను గెలిచి ఇంటర్నెట్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాయి. మొదటి సింగిల్, "ఓసెలియా," కి గణేష్ క్రోవ్విది, రిక్కీ బి మరియు ఫిరోజ్ ఇజ్రాయెల్ సంగీతం అందించగా, ఇటీవల టాలీవుడ్ సంచలనం కావ్య కళ్యాణ్ రామ్ నటించారు. ఈ మెలోడీ ట్రాక్ వేగంగా చార్ట్‌బస్టర్‌గా మారి, మెలోడీ సంగీత ప్రేమికులను లోతుగా ఆకట్టుకుంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని, Vyrl సౌత్ తన రెండవ సింగిల్, "సిన్నదాని సూపులే"ని విడుదల చేసింది. టెలివిజన్ సెన్సేషన్ శ్రీ సత్య మరియు వినోద్ కుమార్ ఎస్ నటించిన ఈ పాట అద్భుతమైన విషువల్స్ తో వినడానికి శ్రవణానందంగా ఉంది. ఈ పాటకి యాడిక్రీజ్ సంగీతం అందించడంతో పాటు, సిన్నదాని సుపులే సాంగ్ లో కనిపించారు కాదు, వీరితో పాటు సాకేత్ కొమండురి, దాసరి మేఘన నాయుడు కూడా ఈ పాటలో పెర్ఫార్మన్స్ చేశారు. ఇప్పుడు ఈ పాట కూడా త్వరలో పెద్ద హిట్ గా మారబోతుంది. ఓ సెలియా, సిన్నదాని సుపులే ఈ రెండు పాటలు Vyrl సౌత్ youtube channelలో అందుబాటులో ఉన్నాయి. సంగీత అభిమానులు వీక్షించి వినూత్న సంగీత మాయజాలంలో మునిగి తెలోచ్చు.


Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.